క్లుప్తంగా

మాస శివరాత్రి ప్రత్యేక పూజలు



స్వామివారి సన్నిధిలో భక్తులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9గంటల నుంచి ఒంటి గంట వరకు ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో లింగాష్టక పారాయణం తరువాత శివలింగానికి పంచామృతాభిషేకం, శివ అష్టోత్తర శతనామావళి, ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తూ మంగళహారతులు పట్టారు. ఆలయ ఆవరణలో ఉసిరి, వేప, ర్యాల, మారేడు బిల్వ వృక్షాలకు దీపాలను వెలిగించారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్పకు అభిషేకం చేస్తున్న భక్తులు

దౌల్తాబాద్: కొడంగల్ మండలం రావల్‌పల్లి గ్రామంలో సోమవారం అయ్యప్ప భక్తులు అయ్యప్ప పడిపూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ అనంతరం స్వామికి అభిషేకం, పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు రాములు, పకీరప్ప, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో..

కుల్కచర్ల: స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం శివకుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలదారులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు పట్లోళ్ల వెంకట్రామిరెడ్డి, గురుస్వాములు సతీష్‌కుమార్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రయంబకేశ్వర స్వామి అలంకరణలో శివుడు



త్రయంబకేశ్వరస్వామి అలంకరణలో శివుడు

తాండూరు రూరల్: కార్తీక మాసం ముగింపు సందర్భంగా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా సోమవారం ఘనంగా దీపోత్సవం నిర్వహించారు. పట్టణంలోని శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి దేవాలయంలో శివుడిని నాసిక్ త్రయంబకేశ్వర స్వామిగా అలంకరించారు.

రాకేశ్‌కు డాక్టరేట్

మొయినాబాద్ రూరల్: చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో బయోలాజికల్ ఎవాల్యూషన్ ఆఫ్ సమ్ నావెల్ 1,2,3 ట్రయోజోల్ డేరివెటీయూస్ అంశంపై డాక్టర్ ఎస్.నర్సింహ పర్యవేక్షణలో రాకేశ్ శ్రీరామ పరిశోధన చేశారు. సోమవారం చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కులపతి డాక్టర్ సి.హెచ్. పురుషోత్తమ్ రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ డాక్టర్ సాత్వికరెడ్డి, రాకేశ్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తమ్‌రెడ్డి మాట్లాడారు. కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు వస్తుందని తెలిపారు. కళాశాలలో విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న అధ్యాపకులు మరింత కృషి చేయాలని సాత్వికరెడ్డి సూచించారు. ఉత్తమ ఫలితాలతో కళాశాలకు ఎంతో గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంతో సత్ఫలితాలు

షాద్‌నగర్ రూరల్: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సత్ఫలితాలను సాధిస్తారని ఐ సడక్ ఎక్స్‌ప్రెస్‌వే మేనేజర్ మహ్మద్ అలీ ఇబ్రహీం అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐ సడక్ ఎక్స్‌ప్రెస్ వే ఆధ్వర్యంలో 2వేల లీటర్ల ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడారు. ఆరోగ్యమే మహాభాగ్యమని వ్యాఖ్యానించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతులుగా ఉండాలని, కలుషిత నీటిని తాగడం వలన రోగాల బారిన పడతామని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని చెప్పారు. అనంతరం పాఠశాలకు డెస్క్‌టాప్, కలర్ ప్రింటర్, ప్రొజెక్టర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, ఏపీ.రాజు, విజయ్, ప్రధానోపాధ్యాయుడు సతీష్, కరుణశ్రీ, ఉపాధ్యాయులు రేవతి, జ్యోతి, సర్ఫరాజ్, అన్వర్, నీల్యా, పంచాయతీ కార్యదర్శి ఆరాధన, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం దళారుల పాలు



వరిధాన్యం నూర్పిడి పనుల్లో కూలీలు

- దిగుబడి ఆశాజనకం.. నిరాశ పరుస్తున్న మద్దతు ధర
- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- కల్లాలపై ఎగబడుతున్న వ్యాపారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

దిగుబడి ఆశాజనకంగా ఉందని సంతోషించిన రైతులకు.. ఆదిలోనే నిరాశ ఎదురైంది. పంట చేతికి వచ్చి రోజులు గడుస్తున్నా.. కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రాకపోవడంతో దళారులను ఆశ్రయించి నష్టాలను కొని తెచ్చుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యమే తమకు శాపంగా మారిందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

బొంరాస్‌పేట: ఈ ఏడు వర్షాలు సమృద్ధిగా కురిశాయి. వానాకాలం వరి 'పంట పండింది'. కానీ మధ్యవర్తుల చేతివాటానికి రైతన్నలు నిలువునా దోపిడీకి గురవుతున్నారు. దీని కారణం ప్రభుత్వ మేనని మట్టి బిడ్డలు ఆరోపిస్తున్నారు. పంట చేతికి వచ్చే నాటికి కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటే.. దళారులను దగ్గరికి రానిచ్చేవారం కాదని ఆవేదన చెందుతున్నారు. ధాన్యం కేంద్రాలు, సమీపాన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో వ్యాపారులకు విక్రయించక తప్పడం లేదని చెప్పారు.

దళారుల హవా

అన్నదాతలు రేయింబవళ్లు చెమటోడ్చి పండించిన ధాన్యపు గింజలతో దళారుల వ్యాపారం.. మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. రైతన్నల అవసరాలను అవకాశంగా తీసుకున్న మధ్యవర్తులు, మిల్లర్లు, వ్యాపారులు ఏకమై తుంకిమెట్ల, ఏర్పుమళ్ల, మెట్లకుంట తదితర గ్రామాల్లో అరకొర ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇలా కల్లాల వద్దకు వచ్చి, రైతులను మభ్యపెట్టి దిగుబడిని దోస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా.. మద్దతు ధర సరిగా లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

'మద్దతు' ఇవ్వరు.. కొనుగోలు చేయరు

వరికి ప్రభుత్వ ధర ఏగ్రేడు క్వింటాలుకు రూ. 2,203, బీగ్రేడుకు రూ.2,163 ఉంది. తేమ శాతం 14కంటే ఎక్కువగా ఉంటే తక్కువ ధర పలుకుతుంది. ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టి మద్దతు ధర కల్పిస్తారు. ఇదివరకు ఐకేపీ, మహిళా సంఘాల ద్వారా కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ మద్దతు ధర ఇచ్చి రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసేవారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. కానీ ఈసారి ధాన్యం చేతికి వచ్చినా.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

కలిసి రావటం లేదు



కష్టానికి తగిన ఫలితంగా దిగుబడి మంచిగానే వచ్చింది. కానీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు ధాన్యం విక్రయిస్తున్నాం. రోజులు గడుస్తున్న కొద్దీ ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందుకే వచ్చిన ధరకు అమ్ముకుంటూ నష్టపోతున్నాం. పంట చేతికి వచ్చే సమయానికి కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధరతో కొనుగోలు చేస్తే బాగుంటుంది. ఏ విధంగానూ వరి రైతులకు కలిసి రావటం లేదు.

– రాంచంద్రయ్య, రైతు, కొత్తూరు

భూ పత్రాలతో ఫిర్యాదు చేయండి

తహసీల్దార్ కిరణ్‌కుమార్



మోమిన్‌పేట: రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి

మోమిన్‌పేట: భూ సమస్యలు ఉన్న వారు సంబంధిత పత్రాలను ఫిర్యాదుకు జతచేసి ఇవ్వాలని తహసీల్దార్ మనోహర చక్రవర్తి సూచించారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పలు దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. సమస్య చెప్పే ముందు పూర్తి అవగాహనతో ఉండాలని చెప్పారు. ఫిర్యాదులో పేర్కొన్న విధంగా మీ సేవలో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తహసీల్దార్ పేర్కొన్నారు. ధరణి సమస్యలను మీ సేవలో దరఖాస్తు చేసి, తగిన ఆధారాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ప్రజా సమస్యల కోసం..

పెద్దేముల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ప్రతి సోమవారం తహసీల్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తామని తహసీల్దార్ కిషన్ తెలిపారు. ప్రస్తుత కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందాయని చెప్పారు. పట్టా పాసుబుక్‌ల కోసం గోపాల్‌పూర్, మంబాపూర్ గ్రామాలకు చెందిన రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయని, త్వరలో వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రెవెన్యూకు సంబంధించిన సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆటల్లోనూ రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

కుల్కచర్ల: ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని బండవెల్కిచర్ల జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు పెంటయ్య అన్నారు. ఈ నెల 10న షాద్‌నగర్‌లో జరిగిన కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన వారిని అభినందించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం కరాటే మాస్టర్లు కరీం, జ్యోతిలను ఉపాధ్యాయ బృందం అభినందించింది. సత్తాచాటిన విద్యార్థులు వీరే.. అండర్ 15లో అఖిల మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో అనూష, అండర్ 16లో పూజ ద్వితీయ స్థానం సంపాదించగా, నాలుగో స్థానంలో అనిత నిలిచింది. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు పరందాములు, నర్సింహులు, నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరిత లక్ష్యం 1.65 లక్షలు

- సిద్ధమవుతున్న వన నర్సరీలు
- ఇప్పటికే ప్రారంభమైన పనులు



ప్లాస్టిక్ సంచుల్లో మట్టిని నింపుతున్న కూలీలు

దౌల్తాబాద్: హరిత తెలంగాణే లక్ష్యంగా రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమం తెలంగాణకు–హరితహారం. ఇందులో భాగంగా వచ్చే వానాకాలంలో మొక్కల కోసం గ్రామాల్లో నర్సరీలు సిద్ధం చేస్తున్నారు. మండలం పరిధిలో 33 నర్సరీలు ఏర్పాటు చేయగా.. వాటిలో పనులు సాగుతున్నాయి. ఇదిలా ఉండగా.. మండలంలో 1.65 లక్షల మొక్కలు పెంచేందుకు అధికారులు నిర్ణయించారు. అందుకు ప్రతి నర్సరీలో 5వేల మొక్కలు పెంచనున్నారు. అయితే కొన్ని మొక్కలు పాడయ్యే అవకాశం ఉండటంతో అదనంగా మరో వెయ్యి మొక్కలు పెంచాలని నిర్దేశించారు.

పూల మొక్కలకు ప్రాధాన్యత

పండ్లు, పూల మొక్కలకే ప్రజలు ప్రాధాన్యాత ఇస్తుండటంతో.. వాటినే నర్సరీలలో పెంచాలని అధికారులు నిర్ణయించారు. వీటితో పాటు నీడ నిచ్చే, అలంకరణ మొక్కలు, రైతులకు ఆర్థికంగా లాభం చేకూర్చే టేకు, సీతాఫలం వంటి మొక్కలను పెంచనున్నారు. గులాబీ, టికోమా, టేకు, జామ, ఉసిరి, గన్నేరు, బూరుగ వంటివి పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. అందుకు ఇప్పటి నుంచే నర్సరీల్లో పనులు మొదలు పెట్టారు. మట్టిని ఎరువుల మిశ్రమాన్ని ప్లాస్టిక్ సంచుల్లో కూలీలు నింపుతున్నారు. పనులు చివరి దశకు చేరుకున్నాయని ఏపీఓ రంజిత్‌కుమార్ పేర్కొన్నారు.

నేడు మైనింగ్‌పై సమీక్ష

తాండూరు రూరల్: ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం మైనింగ్ శాఖపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి నియోజకవర్గంలోని ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు పాల్గొనాలని ఆయన ఆదేశించారు. వాల్టా చట్టంపై కూడా చర్చించనున్నట్లు వెల్లడించారు.

పాంబండలో లక్షబిల్వార్చన

కుల్కచర్ల: కార్తీకమాసం ముగింపును పురస్కరించుకుని సోమవారం మండల పరిధి బండవెల్కిచర్ల గ్రామంలో శ్రీపాంబండ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో రామలింగేశ్వరుడికి భక్తులు లక్షబిల్వార్చన చేశారు. ఆలయ చైర్మన్ నర్సింహ్మ రాములు, ఈఓ సుధాకర్, అర్చకులు పాండుశర్మ పాల్గొన్నారు.

ఓంకారేశ్వర సన్నిధిలో..

కార్తీకమాసం ముగుంపు సందర్భంగా చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామం ఓంకారేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ అర్చకులు మఠం రాజశేఖర్ భక్తులతో లక్ష దీపోత్సవం నిర్వహించారు. సర్పంచ్ మఠం ప్రమీల, స్థానిక నేతలు ప్రత్యేక పూజలు చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన్ను కుమ్మరి సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెంది.. కాంగ్రెస్‌కు పట్టం కట్టారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించడం ఖాయమని పేర్కొన్నారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రెండింటిని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారని తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు రమేశ్, సాయిలు, రాంచందర్, వెంకటేశ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ కోసం..

జెడ్పీటీసీ విశాల



ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న విశాల

షాద్‌నగర్: ఆత్మరక్షణ కోసం యుద్ధ విద్యలు ఎంతో ఉపయోగపడతాయని జెడ్పీటీసీ తాండ్ర విశాల అన్నారు. పట్టణంలోని ఠాగూర్ పాఠశాల మైదానంలో సౌత్ ఇండియా కుంగ్‌ఫూ, కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని మాస్టర్ శివకృష్ణగౌడ్ తెలిపారు. కరాటే కటాస్ విభాగంలో వైష్ణవి, లావణ్య, జ్యోతి, వైష్ణవి, మీనా, సావిత్రి, గంగమ్మ మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. విద్యార్థులకు సినీ నటుడు ఇంద్రసేన, జెడ్పీటీసీ విశాల ట్రోఫీలతో పాటు, ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, యుద్ధ విద్యలు నేర్చుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్రతి విద్యార్థిని ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులు చదువుల్లో రాణించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం శివకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో తాండ్ర శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు ఆహ్వానం

షాద్‌నగర్ రూరల్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూర్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న కళాశాలలో మైక్రోబయోలజీ-1, కంప్యూటర్ సైన్స్-1, కెమిస్ట్రీ-1, జువాలజీ-1 బోధించుటకు అధ్యాపకులు కావలన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు పత్రాలతో ఈ నెల 12, 13 తేదీల్లో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

హక్కులు లేని మనిషి బానిసే



హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్ రూరల్: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ రావూరి బాలరాజ్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధి కిషన్‌నగర్‌లో ఇండియన్ హైట్స్ స్కూల్‌లో ట్రిలా సూపర్ వెడ్డింగ్ యాప్ ప్రతినిధి మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిత్యావసర సరుకులు, వస్తువుల విక్రయాల్లో జరిగే మోసాలను పసికట్టాలని సూచించారు. హక్కులు లేని మనిషి బానిసతో సమానమని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సమస్యలు చుట్టుముట్టినా కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయితేజ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ, రాష్ట్ర ఐటీ వింగ్ కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్, అడ్వైజరీ చైర్మన్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



అరిస్టాటిల్ పీజీ కళాశాలలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మొయినాబాద్: ఆరోగ్యమే మహాభాగ్యమని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధి అరిస్టాటిల్ పీజీ కళాశాలలో సోమవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మాక్స్‌విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి, జర్మన్‌టెన్ ఆస్పత్రి, క్లోవ్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, వైద్య పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అందరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ లయన్స్ క్లబ్ ప్రతినిధి రమాదేవి, వైద్య శిబిరం కోఆర్డినేటర్ స్వేత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మల్లారెడ్డి, అధ్యాపకులు కనకారావు, దీప్తి, రమేశ్, రాజేందర్‌రెడ్డి, స్రవంతి, జ్యోతి కసోని, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం

కొడంగల్ రూరల్: పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయం పరిపాలనా దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తోటి వారికి పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా గొల్ల రాఘవేందర్, డీఈఓగా పిట్ల శేఖర్, ఎంఈఓగా మామిళ్ల శేఖర్, సీఆర్‌పీగా నిరంజన్, హెచ్‌ఎంగా అభిలాష్, పీఈటీగా సాయి వరుణ్, అటెండర్‌గా అరవింద్‌లతో పాటు 9మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఇందులో ప్రతిభ చాటిన వారికి హెచ్‌ఎం క్రాంతికుమార్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

మిగిలేది పిప్పే..

చేదెక్కిన చెరకు సాగు

- దశాబ్దాలుగా మారని రైతుల తలరాత
- అందుబాటులో లేని ఫ్యాక్టరీలు
- విధిలేక మధ్యవర్తులను ఆశ్రయిస్తున్న కర్షకులు



చెరకు పంటను కోస్తున్న కూలీలు

తీపిని పంచాల్సిన చెరకు సాగు.. రైతన్నకు చేదును పంచుతోంది. దశాబ్దాల కాలంగా పంటను నమ్ముకున్న వారికి పిప్పి మిగుల్చుతోంది. పంట పండించడం ఒక ఎత్తైతే.. దానిని విక్రయించడం తలకు మించిన భారంగా మారింది. దీని కారణం స్థానికంగా చెరకు కర్మాగారం లేకపోవడమేనని కర్షకులు స్పష్టం చేస్తున్నారు.

పెద్దేముల్: ప్రభుత్వాలు, పాలకులు మారినా చెరకు రైతుల బతుకులు మారటం లేదు. సుమారు నాలుగు దశాబ్దాలుగా చెరకు ఫ్యాక్టరీ కోసం ఎదురు చూస్తున్నా.. వారి గోడును ఆలకించే వారే లేరు. తెలంగాణ ప్రభుత్వం వస్తే కష్టాలు గట్టెక్కుతాయనుకున్న వారి ఆశలు అడియాశలయ్యాయి. పదేళ్ల పాటు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. చెరకు కర్మాగారాల గురించి పట్టించుకోలేదని, ఫలితంగా దళారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. దీంతో ఏడాది పాటు కష్టానికి ఫలితంగా నష్టమే మిగులుతోంది. జిల్లాలోని పెద్దేముల్, కోటపల్లి, ధారూర్, మర్పల్లి, మోమిన్‌పేట, బంట్వారంతో పాటు పలు మండలాల్లోని రైతులు సుమారు 40 ఏళ్లకు పైగా చెరకు పంట సాగుచేస్తున్నారు. కానీ.. దిగుబడిని విక్రయించాలంటే సంగారెడ్డి–గణేశ్ ఫ్యాక్టరీ, కొత్తకోట, కర్ణాటకకు తరలించాల్సి ఉంటుంది.

పెరిగిన పెట్టుబడి

ప్రస్తుతం జిల్లాలో సుమారు 20వేల ఎకరాలకు పైగా చెరకు సాగవుతున్నట్లు తెలుస్తోంది. పదేళ్ల క్రితం 30వేలకు పైగా సాగయ్యేది. దిగుబడిని విక్రయించేందుకు ఫ్యాక్టరీలు లేక, సమయానికి వాటి యజమాన్యం కోతలు చేయక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సాగు క్రమంగా సాగు తగ్గుముఖం పడుతోంది. జిల్లాల్లో సాగుకు అనుకూల మైన నేలలు, వాతావరణం ఉంది. దానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తే ఆ రైతులకు అన్ని విధాలా కలిసి వస్తుంది. తద్వారా సాగును పెంచుతారు. ఇదిలా ఉండగా.. పెట్టుబడి ఏటేటా పెరుగుతోందని, మద్దతు ధర మాత్రం పెరగటం లేదు. పంట చేతికి వచ్చే సమయంలో కర్మాగారాల యాజమాన్యాలు ధర పెంచుతామని చెప్పి, తీరా పంట తీసుకునే సమయానికి నామమాత్రపు రేటు కట్టిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా.. స్థానికంగా చెరకు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని మంత్రులకు విన్నవించామని, కానీ ఎవరూ ఆ దిశగా చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఫ్యాక్టరీ అందుబాటులో ఉంటే సాగు పెరుగుతుందని చెబుతున్నారు.

ఎకరాకు రూ.45వేలు

ఎకరా చెరకు సాగుచేయాలంటే సుమారు రూ.40వేల నుంచి రూ.45వేల వరకు ఖర్చు అవుతుంది. 40టన్నులకు పైగా దిగుబడి వస్తుంది. దానికి మద్దతు ధర టన్నుకు రూ.4వేలు వస్తే..పెట్టుబడులు పోను తగిన ఫలితం వస్తుంది. గతంలో ప్రభుత్వం సబ్సిడీపై పురుగు మందులు, ఎరువులు ఇచ్చేది. ప్రస్తుతం అవేమి లేవు. దిగుబడి ఆశించిన మేరకు వచ్చినా.. కోత సమయంలో కూలీల కొరత, విక్రయించాలంటే ఫ్యాక్టరీలు లేకపోవడంతో రైతులు సాగును తగ్గిస్తున్నారు. ఐదేళ్ల క్రితం మండలంలో 4వేల ఎకరాలకు పైగా పంట పండేది. ప్రస్తుతం అది 2వేలకు చేరుకున్నట్లు సమాచారం.

నష్టపోతున్నాం..



రైతుల కష్టం మధ్య వర్తుల పాలవుతోంది. చెరకు ఫ్యాక్టరీలు అందుబాటులో ఉంటే పెట్టుబడులు పోను ఆదాయం వచ్చేది. అవి లేని కారణంగా చెరకును దళారులకు విక్రయిస్తున్నాం. తద్వారా నష్టపోతున్నాం. ఆదాయం సంగతి ఎలా ఉన్నా.. పంట తీసుకున్న ఆర్నెళ్లకు కాని డబ్బులు ఇవ్వటం లేదు. అది కూడా టన్నుకు రూ.200 నుంచి రూ.300వరకు ధర తగ్గించి ఇస్తున్నారు. దీంతో చెరకు సాగును తగ్గించుకోక తప్పడం లేదు.

– వెంకటరెడ్డి, రైతు, అడ్కిచెర్ల

రాయితీపై ఎరువులు ఇవ్వాలి

చెరకు రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై ఎరువులు అందజేయాలి. ఎరువుల ధరలు పెరుగుతుండటంతో పెట్టుబడి అమాంతం పెరిగి పోతోంది. కానీ మద్దతు ధర లేక నష్టపోతున్నాం. ఇదే విషయాన్ని పాలకులకు చెబుతూనే ఉన్నాం. కానీ ఎవరూ స్పందించడం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలి.

– రామచంద్రయ్య, రైతు, బండమీదిపల్లి